నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
8 | సోమవారం 17 ఫిబ్రవరి 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD




ఇచ్చోడ మండలంలోని ముక్రా(కే) గ్రామంలో మొక్కలు నాటి సెల్ఫీ దిగుతున్న మాజీ సర్పంచ్ గాడ్గే మీనాక్షి



- ఇప్పటికే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా ప్రారంభం
- ముక్రా(కే)లో మొక్కలు నాటి నీరు పోసిన అభిమానులు

పుట్టిన రోజు వేడుకలకు ఏర్పాట్లు చేసిన బీఆర్ఎస్ శ్రేణులు

*తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, గులాబీ బాస్ కేసీఆర్ పుట్టిన రోజును నేడు ఘనంగా జరుకునేందుకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు, ప్రజలు సిద్ధమయ్యారు. ఇప్పటికే పలుచోట్ల ముందస్తు బర్త్‌డే వేడుకలు నిర్వహించారు. వృక్షార్చన కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలోని ముక్రా(కే) మాజీ సర్పంచ్ మీనాక్షీ-సుభాష్ గాడ్గే దంపతులు తమ మనవనికి కేసీఆర్ పేరు పెట్టారు. రైతులు తమ పొలాల్లో కేసీఆర్ చిత్రపటానికి పుష్పాభిషేకం చేశారు. నేడు(సోమవారం) బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ ఆధ్వర్యంలో నేరడిగొండలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నారు. 1000 మందికి పైగా పాల్గొననున్నారు. అలాగే మంచిర్యాల జిల్లా చెన్నూర్ పట్టణంలో నేడు పెద్ద ఎత్తున వృక్షార్చన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆధ్వర్యంలో పుట్టిన రోజు వేడుకలు నిర్వహించి, మొక్కలు నాటనున్నారు. మందమర్రిలోని పాలచెట్టు ఏరియాలోని శ్రీ పంచముఖి ఆంజనేయ స్వామి ఆలయంలో సోమవారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని, మనో వికాస్ పాఠశాలలో కేక్‌కట్ చేస్తామని, విద్యార్థులకు పండ్లు పంపిణీ చేస్తామని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రవీందర్ ఓ ప్రకటనలో తెలిపారు.*

*- ఆదిలాబాద్, ఫిబ్రవరి 16 (నమస్తే తెలంగాణ)*

# శిశు మందిరాలు.. సంస్కృతికి నిలయాలు

- ఆసిఫాబాద్‌లో ఎమ్మెల్యే కోవ లక్ష్మి
- అట్టహాసంగా పూర్వ విద్యార్థుల మహా సమ్మేళనం



మాట్లాడుతున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, ఫిబ్రవరి 16 : సరస్వతీ శిశు మందిరాలు సంస్కృతికి నిలయాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, శిశు మందిర్ విద్యాపీఠం దక్షిణ మధ్య క్షేత్రం సంఘటన కార్యదర్శి లింగం సుధాకర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని స్థానిక సరస్వతీ శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో 1979-2024 వరకు చదువుకున్న విద్యార్థుల మహా సమ్మేళనం జరిగింది. ఎమ్మెల్యేతో పాటు లింగం సుధాకర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. మనిషి వికసించాలంటే చదువుతో పాటు క్రమశిక్షణ అవసరమన్నారు. మాజీ జడ్పీటీసీ సభ్యుడు అరిగేలా నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ తమ పిల్లలు శిశు మందిర్‌లో చదివి విదేశాల్లో స్థిరపడి మంచి పేరు తెచ్చుకున్నారన్నారు. అంతకుముందు పూర్వ విద్యార్థులంతా ఓకేచోట చేరి ఆత్మీయంగా పలకరించుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ సందర్భంగా విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కాగా, అమెరికా నుంచి గోపికృష్ణ అనే పూర్వ విద్యార్థి పాల్గొనడం విశేషం. ఈ కార్యక్రమంలో శిశు మందిర్ పాఠశాల పూర్వ విద్యార్థి పరిషత్ నాయకులు బొడ్డు శ్రీనివాస్, రాజ రెడ్డి, శిశు మందిర్ పాఠశాల అధ్యక్షుడు చిలువేరు వెంకటేశ్, డాక్టర్ విష్ణువర్ధన్‌రావు, శిశు మందిర్ పాఠశాల ప్రథమ ప్రధానోపాధ్యాయుడు సుధాకర్, బోనగిరి సతీశ్, వెంకటేశ్వర్లు, శిశు మందిర్ పాఠశాల ప్రధానాచార్యులు, ఆచార్యులు, తదితరులు పాల్గొన్నారు.



పాల్గొన్న పూర్వ విద్యార్థులు

# ఆర్ఎస్పీపై దుష్ప్రచారం చేస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

**కాగజ్‌నగర్ డీఎస్పీకి బీఆర్ఎస్ నాయకుల ఫిర్యాదు**

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 16 : బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌పై దుష్ప్రచారం చేస్తున్న బెజ్జూర్ మండలం కుకుడ గ్రామానికి చెందిన ఓ చానల్ రిపోర్టర్ కొత్రంగి రమేశ్‌పై చర్యలు తీసుకోవాలని ఆ పార్టీ నాయకులు ఆదివారం కాగజ్‌నగర్ డీఎస్పీ రామనుజంకు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ సోషల్ మీడియా, వాట్సాప్ గ్రూప్‌లలో ఆర్ఎస్పీపై దుష్ప్రచారం చేస్తున్నాడని, ఆయనకున్న గౌరవాన్ని దెబ్బతీస్తున్నాడని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సిర్పూర్ నియోజకవర్గ కన్వీనర్ లెండుగురే శ్యామ్‌రావ్, యూత్ కన్వీనర్ కాశిపాకా రాజు, మాజీ కౌన్సిలర్ నక్క మనోహర్, సయ్యద్ బాబర్, రాజేశ్, విజయ్, నజీమ్ షేఖ్, ఇంతియాజ్, తదితరులు పాల్గొన్నారు.

**కౌటాల పోలీస్ స్టేషన్‌లో..**

కౌటాల, ఫిబ్రవరి 16 : బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌పై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్న కొత్రంగి రమేశ్‌పై చర్యలు తీసుకోవాలని ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బీఆర్ఎస్ నాయకులు ఫిర్యాదు చేశారు. వినతి పత్రం అందించిన వారిలో బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు యూత్ అధ్యక్షుడు కార్తీక్, ఉపాధ్యక్షుడు దిలీప్, నాయకులు మోతిరాం, నవీన్, మధుకర్ ఉన్నారు.




డీఎస్పీ కార్యాలయం ఎదుట మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

# లక్ష్యాలను అధిగమించాలి

**సింగరేణి డైరెక్టర్ వెంకటేశ్వర్లు**

జైపూర్, ఫిబ్రవరి 16: ఆర్థిక సంవత్సర లక్ష్యాలను అధిగమించేందుకు ప్రణాళికతో ముందుకెళ్లాలని సింగరేణి డైరెక్టర్ పీపీ వెంకటేశ్వర్లు సూచించారు. ఆదివారం శ్రీరాంపూర్ ఇన్‌చార్జి జీఎం శ్రీనివాస్‌తో కలిసి డివిజన్‌లోని ఇందారం ఓపెన్‌కాస్టుగనిని సందర్శించారు. 2024-25 లక్ష్యసాధనకు ఈ 45 రోజులు కీలకమైనవని గుర్తుచేశారు. అధికారులతో కలిసి ఓపెన్ కాస్టు గనిలోని పనిస్థలాల వద్ద బెంచ్‌లను, ఆఫ్ లోడింగ్ ప్రదేశాలను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఓసీలో మట్టి నిర్వహణ పనులు చేపడుతున్న వరహా కంపెనీ ప్రతినిధులతో మాట్లాడారు. ఉత్పత్తికి అనుగుణంగా ఓబీ తీయాలని సూచించారు. ఈ ఆర్థిక సంవత్సరం ఉత్పత్తి ఉత్పాదకత సాధించడంలో ముందుండాలని తెలిపారు. ఆయన వెంట గని ప్రాజెక్టు అధికారి ఏవీ రెడ్డి, మేనేజర్లు రవికుమార్, నాగన్న, రక్షణ అధికారి సతీశ్ పాల్గొన్నారు.

**కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి**

మందమర్రి, ఫిబ్రవరి 16 : సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం(టీబీజీకేఎస్) నాయకులు సింగరేణి డైరెక్టర్(పీపీ) కొప్పుల వెంకటేశ్వర్లును కోరారు. సింగరేణి డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్వర్లను ఆదివారం గోదావరిఖనిలోని డైరెక్టర్ క్యాంప్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు సానుకూలంగా స్పందించారు. సంస్థ నిర్దేశిత లక్ష్యాల సాధనలో నాయకులు భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపల్లి సంపత్, కేంద్ర కమిటీ నాయకులు సీహెచ్ వెంకటరమణ, దాసరి శ్రీనివాస్, రాజనాల రమేశ్, కే.లక్ష్మణ్, కూడాల తిరుపతి, కొట్టె రమేశ్, రవికిరణ్, పెద్దపల్లి రాజయ్య పాల్గొన్నారు.



మందమర్రి : సింగరేణి డైరెక్టర్(పీపీ)వెంకటేశ్వర్లకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

# 'గిరి వికాసం'పై అలసత్వం

- బోర్లు వేసి మోటర్లు, విద్యుత్ సౌకర్యం కల్పించని అధికారులు
- ఏళ్ల తరబడి నిరీక్షిస్తున్న గిరిజన రైతులు



తన చేనులోని విద్యుత్ లేన్‌ను చూపిస్తున్న రైతు

కుమ్రం భీం ఆసిఫాబాద్ (నమస్తే తెలంగాణ)/ కెరమెరి, ఫిబ్రవరి 16 : అడవిబిడ్డలకు సాగు నీరందించేందుకు ప్రత్యేకంగా అమలు చేస్తున్న 'గిరి వికాసం'పై యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. బోర్లు వేసి ఏళ్ల గడుస్తున్నా విద్యుత్ సౌకర్యం కల్పించకపోవడంతో పాటు కరెంట్ మోటర్లు ఏర్పాటు చేయకపోవడంతో రైతాంగం కోటి ఆశలతో ఎదురుచూస్తున్నది.

**ఒక్కో యూనిట్‌కు రూ.3.50 లక్షలు**

కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో 'గిరి వికాసం' పథకం కోసం ప్రత్యేకంగా సర్వేలు చేపట్టిన అధికారులు.. దానిని పూర్తిస్థాయిలో అమలు చేయడంలో మాత్రం విఫలమయ్యారు. గతంలో ఇందిర జలప్రభ పేరుతో ఉన్న ఈ పథకాన్ని ఆపై 'గిరి వికాసం'తో పేరుతో అమలు చేస్తున్నారు. ఒక్కో యూనిట్‌కు రూ. 3.50 లక్షల దాకా ఖర్చు చేస్తున్నారు. పదెకరాలకో యూనిట్‌ను అమలు చేస్తున్నారు. ఐదెకరాలు కలిగిన ఇద్దరు రైతులు.. లేక అంతకంటే తక్కువ భూమి కలిగిన ముగ్గురు రైతులకు కలిపి ఒక యూనిట్‌ను అమలు చేస్తున్నారు.

**కేవలం 13 యూనిట్లే..**

ఇందిర జల ప్రభ (గిరి వికాసం) పథకం కింద 169 యూనిట్ల కోసం రూ. 92 లక్షల దాకా ఖర్చుచేశారు. రైతుల చేల వద్ద 482 బోరుబావులను తవ్వించారు. విద్యుత్ లేన్‌ల ఏర్పాటు కోసం రూ. కోటీ 78 లక్షలు కూడా కేటాయించారు. కానీ ఆపై విద్యుత్ లేన్‌లు గాని, మోటర్లుగాని ఏర్పాటు చేయలేదు. ఇప్పటి వరకు మొత్తంగా 13 యూనిట్లు మాత్రమే పూర్తిస్థాయిలో అమలు చేశారు. మిగతా వాటికి విద్యుత్ కనెక్షన్‌లు, మోటర్లు ఏర్పాటు చేయకపోవడంతో బోర్లన్నీ నిరుపయోగంగా మారాయి. దీనికి తోడు అటవీ ప్రాంతంలో ఉండే వ్యవసాయ భూములకు విద్యుత్‌లేన్‌లు వేసేందుకు అటవీశాఖ ఆంక్షలు విధించడం కూడా గిరి వికాసం పథకం అమలుకు అడ్డంకిగా మారాయి.

## బోరు మాత్రమే వేశారు



*గిరివికాసం పథకం కింద నాతో పాటు నా నా చేను పక్కన ఉన్న టేకం జల్పత్‌రావ్‌ను ఎంపిక చేశారు. మా ఇద్దరికి కలిపి పదెకరాలు ఉంది. వాటికి నీరందించేందుకు నా చేనులో బోరు వేశారు. కానీ ఇంతవరకు విద్యుత్ లేన్ ఏర్పాటు చేయలేదు. మోటారు కూడా బిగించలేదు. కరెంటు కనెక్షన్ ఇవ్వాలని అనేకసార్లు అధికారులను కలిశాం. కానీ పట్టించుకోలేదు. ప్రస్తుతం వర్షాలపై ఆధారపడి మాత్రమే పంటలు వేస్తున్నాం. అధికారులు ఇప్పటికైనా స్పందించి మా చేనులో వేసిన బోరుకు విద్యుత్‌లేన్ వేయాలి. మోటారు బిగించాలి.*

**- టేకం రాంషావ్, గిరివికాసం లబ్ధిదారుడు, కెరమెరి**

## బోరున్నా నీళ్లుపెట్టుకోలేక పోతున్నం



*నా చేను పక్కనే మా అమ్మ చేను కూడా ఉంది. గిరి వికాసం పథకం కింద మా ఇద్దరికి కలిపి బోరు వేశారు. మా చేనుకు విద్యుత్ లేన్ కూడా ఇచ్చారు. కానీ ఇంతవరకు మోటర్ ఇవ్వలేదు. బోరున్నా పంటలకు నీరు పెట్టుకోలేని పరిస్థితి ఉంది. ఇంకా కొన్నేళ్లు ఆగితే బోరు కూడా కూలిపోయే అవకాశమున్నది. ఇప్పటైనా అధికారులు స్పందించాలి.*

**- కుడిమెత దౌలత్‌రావు, గిరివికాసం లబ్ధిదారుడు, కెరమెరి**

# పేదలకు సేవచేయడం నా అదృష్టం

**లయన్స్ క్లబ్ రీజినల్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి**




మాట్లాడుతున్న శ్రీకాంత్‌రెడ్డి

జన్నారం, ఫిబ్రవరి 16 : పేదలకు సేవచేయడం నా అదృష్టంగా భావిస్తున్నానని లయన్స్ క్లబ్ రీజినల్ అధ్యక్షుడు ఎనుగు శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పైడిపెల్లి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్- జిల్లా 320 జీ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. పేదలకు సేవ చేసేందుకే లయన్స్‌క్లబ్ ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో లేడీ లయన్స్ ఎనుగు రజితారెడ్డి, ముఖ్య అతిథి రాజరెడ్డి, ఎస్ఐ రాజవర్ధన్, అడ్వైజర్ నారాయణ రెడ్డి, సిబ్బంది, నాయకులు సతీశ్, అంజిత్‌రావు, సందీప్, మణి, రాజన్న, మల్యాల బాపు పాల్గొన్నారు.






ఎంసీహెచ్ ఎదుట ఆందోళన చేస్తున్న బంధువులు, ఆదివాసీ సంఘాల నాయకులు

# ఎంసీహెచ్ సిబ్బంది నిర్లక్ష్యం వల్లే శిశువు మృతి

**దవాఖాన ఎదుట బంధువుల ఆందోళన**

మంచిర్యాలటౌన్, ఫిబ్రవరి 16 : మాతా శిశు సంరక్షణ కేంద్రం (ఎంసీహెచ్) సిబ్బంది నిర్లక్ష్యం వల్లే తల్లి కడుపులో శిశువు మృతి చెందిందని బంధువులు ఆరోపించారు. ఈ మేరకు ఆదివారం మంచిర్యాలలోని ఎంసీహెచ్ ఎదుట బంధువులు, ఆదివాసీ గిరిజన సంఘాల నాయకులు ఆందోళనకు దిగారు. శిశువు మృతికి తమదే తప్పని అధికారులు చెప్పడంపై వారు మండిపడ్డారు. డెలివరీ డేట్‌కు ఒకరోజు ముందే దవాఖానకు రావాలని ప్రయత్నించినా, అంబులెన్స్ లేకపోవడంతో ఆటోలో వచ్చామని, అప్పటికే ఓపీ అయిపోయిందని చెప్పి లేబర్‌రూంకు వెళ్లాలని సూచించారని, అక్కడ ఎవరూ లేకపోవడంతో తిరిగి వెళ్లి మరుసటిరోజు వచ్చామన్నారు. స్కానింగ్‌చేసి కడుపులో పాప చనిపోయిందని చెప్పారని, కేవలం హాస్పిటల్ సిబ్బంది నిర్లక్ష్యం వల్లే తమకు శిశువు దక్కలేదన్నారు. ఆందోళనలో శిశువు తండ్రులు, నాయకులు ఉన్నారు.

